# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం

## మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ నాయకుల సమిష్టి పిలుపు



కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం లక్ష్యంగా కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ నగరంలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇప్పటికే పలుమార్లు సర్వేలు నిర్వహించారని, గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో పార్టీ నాయకత్వం అంతా ఒకే అభిప్రాయంతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడమే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరూ ముందుకు సాగాలని సూచించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనకు దీర్ఘ అనుభవం ఉందని, కరీంనగర్ జిల్లా రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం కార్యకర్తలు గెలిచారని, మున్సిపల్ ఎన్నికల తర్వాత కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేసేలా జిల్లా నాయకత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లలో కరీంనగర్ కార్పొరేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఇక్కడ తప్పనిసరిగా కాంగ్రెస్ జెండా ఎగరవేయాల్సిన అవసరం ఉందన్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ ముందుకు వెళ్తుందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం గ్రామాల్లాగే పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. 66 డివిజన్లలో అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉద్యోగ నియామకాలు, సన్న వడ్ల బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రస్తావించారు. టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలను కోరారు. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని నాయకత్వం స్పష్టం చేసింది.



# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా సమ్మక్క-సారక్క జాతర మహోత్సవం




కరీంనగర్, జనతా న్యూస్, 27 జనవరి 2026 : స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సమ్మక్క--సారక్క జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వాతావరణం, భక్తిశ్రద్ధలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ కళను సంతరించుకుంది. ఈ ప్రత్యేక వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మక్క--సారక్క చిత్రపటాలకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ ఆయన, సమ్మక్క--సారక్క జాతర తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండుగగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ మహోత్సవం మేడారంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ జాతర తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుందని, గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క--సారక్కలు అన్యాయంపై పోరాటానికి ప్రతీకలని పేర్కొన్నారు. సంప్రదాయంగా బెల్లం నైవేద్యంగా సమర్పించే ఆచారం, సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతర ప్రత్యేకతను చాటుతుందని తెలిపారు. ప్రజలంతా ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ ఐక్యత, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలని ఆకాంక్షిస్తూ సమ్మక్క--సారక్క జాతర మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని సంప్రదాయ అలంకరణలతో ముస్తాబు చేశారు. సుమారు వందమంది విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సమ్మక్క--సారక్క వైభవ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ అమల్లో లైసెన్స్ తుపాకులు పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలి

## జనవరి 31లోపు తప్పనిసరిగా అప్పగించాలి: సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్



సిద్ధిపేట, జనతా న్యూస్. 28 జనవరి 2026 : స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల (మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్) కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు తప్పనిసరిగా తమ తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, లైసెన్స్ ఆయుధాలు కలిగిన వారు తేదీ 31-01-2026 లోపు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో తుపాకులను అప్పగించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం నిబంధనల ప్రకారం తిరిగి ఆయుధాలను పొందవచ్చని పేర్కొన్నారు. నిర్దేశిత గడువు లోపు తుపాకులు డిపాజిట్ చేయని వారిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న మండలాలైన హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ సరిహద్దుల్లో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో 24ఇ7 వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణా, నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. పారదర్శకమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని ఆమె స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థుల విజయం అవసరం

## విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి: మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు



పెద్దపల్లి/సుల్తానాబాద్, జనతా న్యూస్ ఎ 28 జనవరి 2026 : మున్సిపాలిటీల అభివృద్ధి వేగంగా జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తప్పనిసరిగా విజయం సాధించాలని, ప్రతి కార్యకర్త అదే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ ఎన్నికల పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ-రమణారావు పిలుపునిచ్చారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ఐల రమేష్ తన భారీ అనుచర గణంతో కాంగ్రెస్ పార్టీలో చేరగా, మంత్రులు, ఎమ్మెల్యేలు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ, మహిళలతో కలిసి బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించి, స్థానిక యశోద నరహరి ఫంక్షన్ హాల్ వరకు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల కాలంలో పెద్దపల్లిలో రూ.63 కోట్లు, సుల్తానాబాద్లో రూ.15 కోట్లతో మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రూ.53 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, రూ.80 కోట్లతో కోర్టు నూతన భవనం, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, రానున్న రోజుల్లో రూ.21.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్యే విజయరమణారావు నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రెండు సంవత్సరాల కాలంలో నాలుగు పోలీస్ స్టేషన్లను పెద్దపల్లికి తీసుకురావడం ఆయన ఘనత అని అన్నారు. సుల్తానాబాద్ చెరువు ప్రాంతాన్ని రూ.8 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే చేసిన కృషిని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తామని తెలిపారు. రెండు సంవత్సరాల కాలంలోనే రూ.1000 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకురావడం సాధారణ విషయం కాదని, అభివృద్ధికి మారుపేరు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అని అన్నారు. ఆశావాహులు ఎవరూ నిరాశ చెందవద్దని, పార్టీ వారికి సముచిత స్థానం కల్పిస్తుందని, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పదవులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ మరో ఐదు సంవత్సరాలు అధికారంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు మినుపాల ప్రకాశ్ రావు, ఈర్ల స్వరూప, సారయ్య గౌడ్, సాయిరి మహేందర్, ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ చీకట్ల ముండయ్య, శ్రీగిరి శ్రీనివాస్, వేగోళం అబ్బయ్య గౌడ్, బిరుదు సమత కృష్ణ, ఊట్ల వరప్రసాద్, ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాశ్ రావు, పెగడ పరుశురాములు, గరిగే శ్రీనివాస్, తొర్రికొండ ప్రభాకర్, గాదాసు రవీందర్, కరుణాకర్, చింతల సునీత రాజు తదితరులు, పెద్ద సంఖ్యలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఆంక్షలు



సిద్ధిపేట, జనతా న్యూస్, 28 జనవరి 2026 : సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు (మున్సిపల్, మున్సిపాలిటీ) ప్రశాంతంగా, శాంతిభద్రతల మధ్య నిర్వహించేందుకు నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని నామినేషన్ కేంద్రాల వద్ద భారత న్యాయ సంహితా విధానం--2023 లోని సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆంక్షలు తేదీ 28 జనవరి 2026 నుంచి 30 జనవరి 2026 వరకు, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా కర్రలు, లాఠీలు, రాళ్లు, కొడవళ్ళు, గొడ్డళ్ళు వంటి ప్రాణాంతక ఆయుధాలు కలిగి ఉండటం చట్టపరంగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. ఈ ఆంక్షలు ముఖ్యంగా క్రింది నామినేషన్ కేంద్రాల వద్ద అమల్లో ఉంటాయని తెలిపారు: చేర్యాల ఓల్డ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం, దుబ్బాక మున్సిపల్ కార్యాలయం, గజ్వేల్ -- ఐఓసీ భవనం, సీ బ్లాక్. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి, నిజమైన అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. పై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించి, పోలీస్ శాఖకు సహకరించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# హుజురాబాద్, జమ్మికుంటలలో ఎన్నికల కేంద్రాల తనిఖీ

## రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణ



కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి తనిఖీ చేశారు. హుజురాబాద్, జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సీపీ, అక్కడ అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ మరియు పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూములను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, బందోబస్తు విషయంలో ఏమాత్రం అలసత్వం వహించరాదని సీపీ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పరి పాపయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ నివాళి



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చొప్పరి శ్రీనివాస్ తండ్రి చొప్పరి పాపయ్య (80) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ బుధవారం వారి నివాసానికి చేరుకుని, పాపయ్య పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ పాపయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపల్ బరిలో నామినేషన్ల జోరు



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వం ఉత్సాహంగా సాగుతోంది.ఎన్నికల గడువు దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా రంగంలోకి దిగుతున్నారు.ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని వివిధ వార్డుల నుంచి నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.పట్టణంలోని 12వ వార్డు నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా గోనెల మధుకర్ తన నామినేషన్ దాఖలు చేయగా, 14వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున దండి లక్ష్మి పోటీలో నిలిచారు. 13వ వార్డు నుంచి బిఎస్పీ అభ్యర్థిగా ఉప్పుల రాంరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా బైరి శ్రీనివాస్ తమ నామినేషన్లను సమర్పించి బరిలో నిలిచారు. అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి వచ్చి నామినేషన్లు వేస్తుండటంతో పట్టణంలో ఎన్నికల వాతావరణం నెలకొంది.

# పర్యావరణ హితమే లక్ష్యం: ఆర్టీసీ సిబ్బందికి స్టీల్ ప్లేట్ల పంపిణీ



హుస్నాబాద్, జనత న్యూస్: మేడారం జాతర విధుల కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్టీసీ సిబ్బందికి రాష్ట్ర రవాణా,బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినూత్నంగా గౌరవం చాటారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన లక్ష్యంగా, ప్లాస్టిక్ వల్ల కలిగే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ సిబ్బందికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. జాతర ప్రత్యేక సేవల కోసం చెంగిచర్ల, గోదావరిఖని డిపోల నుంచి హుస్నాబాద్‌కు వచ్చిన సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో భాగంగా ఈ పంపిణీ చేపట్టారు.పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగానికి స్వస్తి పలకాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న,భోజనం అదించిన బెజగం బాలకృష్ణతో పాటు కేర్ టేకర్ ఏడీసీ మహేందర్ పాల్గొని సిబ్బందికి భోజన వసతిని పర్యవేక్షించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది జి. మల్లేశం, ఎన్.ఎస్. రెడ్డి, భాగ్యలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



చిగురుమామిడి, జనత న్యూస్: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన సుధగోని సుదర్శన్ గౌడ్ (58) బుధవారం ఉదయం కల్లు గీసేందుకు చెట్టెక్కారు. ఈ క్రమంలో కాలు జారి కింద పడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన సుదర్శన్ గౌడ్‌ను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ శంకర్ తో పాటు గౌడ సంఘం జిల్లా నాయకుడు సుధగోని రాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# హుస్నాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**20కి 20 వార్డుల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

**పార్టీలోకి మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, కీలక నేతల చేరిక**

**అభివృద్ధికి పట్టం కట్టండి: మంత్రులు తుమ్మల, పొన్నం పిలుపు**





హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపాలిటీని సర్వతోముఖాభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డుల్లోనూ పార్టీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనితారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్నతో పాటు పలువురు ముఖ్య నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### సర్వే ఆధారంగానే టికెట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక శాస్త్రీయంగా, సర్వే ఆధారంగానే ఉంటుందని... గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తాం అని తెలిపారు. హుస్నాబాద్‌ను విద్యా, వైద్య, పారిశ్రామిక రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని అన్నారు. పట్టణానికి నాలుగు వైపులా నాలుగు వరుసల రహదారులు, 250 పడకల ఆసుపత్రి, ఇంజనీరింగ్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల వంటి పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు.

### పొన్నం పట్టుదలతోనే నిధుల ప్రవాహం: మంత్రి తుమ్మల

హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కేబినెట్ సమావేశాల్లో నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమ పథకాలను ఆపకుండా ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గౌరవెల్లి భూసేకరణ పనులను వేగవంతం చేశాంమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో దెబ్బలు తిన్న ఉద్యమకారుడు పొన్నం అని, అటువంటి నాయకుడికి అండగా నిలిచి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి,మజీ హౌస్ పెయిడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య,హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు,నాయకులు మంజుల రెడ్డి, చిత్తారి రవీందర్, వి వెంకటరమణ, నియోజకవర్గ స్థాయి నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# రైతులు, కూలీలకు వ్యతిరేకం మోడీ ప్రభుత్వం

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.**




జనత న్యూస్ బెజ్జంకి: యూపీఏ ప్రభుత్వం 2005వ సంవత్సరంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో వలసలు నివారించి, పేద కూలీల కడుపులు నింపాలని ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం, మహాత్ముడి పేరు లేకుండా చేయడమే కాకుండా, పేద కూలీలను ఇబ్బందులకు గురిచేసే విధంగా చట్టాన్ని సవరణ చేస్తున్నదని, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం మండల కేంద్రంలో చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాలలో ఉపాధి హామీ పని చేపట్టాలంటే , గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభల ద్వారా నిర్ధారించే వారిని, ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఎక్కడో ఢిల్లీ నుండి పనులకు అనుమతులు ఇస్తేనే గ్రామాలలో పనులు చేసే విధంగా చట్టాలను సవరిస్తూ, గతంలో రైతు వ్యతిరేక చట్టాలు చేసి అనేకమంది రైతుల మరణాలకు కారకులయ్యారని, ఇప్పుడు కూలీల పొట్ట కొట్టే విధంగా చట్టాలను సవరించడానికి సిద్ధపడ్డారని మండిపడ్డారు. రైతులు, కూలీలకు వ్యతిరేకంగా చేసే చట్టాలు రద్దయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు రైతులు, కూలీల కు మద్దతుగా ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ఇంచార్జ్ నమిండ్ల శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి పాషా హాజరై ఉపాధి హామీ కూలీలు చేస్తున్న నిరసనకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ , వైస్ చైర్మన్ చిలివేరి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల పోరం మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు , వార్డు సభ్యులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

**మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సమావేశం**

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**హెల్ప్‌లైన్: 1800 233 1495**



రాజన్న సిరిసిల్ల, జనతా న్యూస్ ఎ 28 జనవరి 2026 : మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని, ఎన్నికలను పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల కేంద్రం, మీడియా సెల్, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల కోసం 1800 233 1495 నెంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతా తెరవాలని, నామినేషన్ పత్రాలను పూర్తిగా నింపాలని సూచించారు. ప్రచార వాహనాలు, లౌడ్‌స్పీకర్లు, సభలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్ నిర్వహించాలంటే మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు. నామినేషన్లు ఈ నెల 30 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని, ఆయా మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు జిల్లాను విడిచిపెట్టాలని సూచించారు. ప్రచార కరపత్రాలపై ముద్రించిన వారి వివరాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేట్ ఆస్తులపై ప్రచార రాతలు వేయాలంటే యజమాని అనుమతి తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి రాతలు చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మాత్రమే ప్రచారం నిర్వహించాలని సూచించారు.

**ముఖ్య తేదీలు (సంక్షిప్తంగా):**

నామినేషన్ల స్వీకరణ చివరి తేదీ -- 30-01-2026
పోలింగ్ -- 11-02-2026
ఓట్ల లెక్కింపు -- 13-02-2026

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అన్ని ప్రక్రియలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. బుధవారం హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లు పరిశీలించి, ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.

నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ అభ్యర్థుల ప్రకటన వంటి ఎన్నికల ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, రోజు వారీగా వెంటనే టీ--పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను సక్రమంగా దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ పత్రాల పరిశీలన కోసం అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థలో తొలి రోజు ప్రశాంతంగా నామినేషన్లు



కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో తొలి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని మొత్తం 66 డివిజన్లకు సంబంధించి 33 నామినేషన్ కౌంటర్లలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించారు. ఎన్నికల సంఘం రూపొందించిన ఆన్‌లైన్ టీ--పోర్టల్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేశారు. మొదటి రోజు మొత్తం 76 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 66 డివిజన్లలో మొత్తం 80 నామినేషన్ సెట్లు వచ్చాయి. నామినేషన్ ప్రక్రియను కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వయంగా కౌంటర్లను సందర్శించి తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఎన్నికల నియమ నిబంధనలను అనుసరిస్తూ నామినేషన్ల స్వీకరణ జరిగిందన్నారు. ప్రతి నామినేషన్ పత్రాన్ని నియమావళి ప్రకారం పరిశీలించి, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నో డ్యూ సర్టిఫికేట్‌ను కళాభారతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా పొందాలని సూచించారు. ఆస్తి పన్ను, నల్లా పన్నులు, ఇతర పన్నుల రిసిప్టులు చూపించి నో డ్యూ సర్టిఫికేట్ పొందవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి అభ్యర్థి కొత్త బ్యాంక్ అకౌంట్ తెరిచి, నామినేషన్ సెట్టుతో పాటు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని తెలిపారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.1.50 లక్షలకు మించకుండా ఖర్చుల వివరాలు చూపాలని, ప్రచార వాహనాలు, ర్యాలీలు, రోడ్ షోలు, పబ్లిక్ మీటింగ్స్ కోసం పోలీస్ శాఖ నుంచి ఎన్‌ఓసీ పొంది, ఎంసీసీ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. మొదటి రోజు పార్టీ వారీగా వచ్చిన నామినేషన్ సెట్లు ఇలా ఉన్నాయి: ఆప్ -- 1, బీఎస్పీ -- 1, బీజేపీ -- 32, కాంగ్రెస్ -- 25, ఏఐఎంఐఎం -- 3, బిఆర్ఎస్ -- 13, టీజీఎస్ఈసీ -- 1, ఇండిపెండెంట్ -- 4. మొత్తం 80 నామినేషన్ సెట్లు నమోదు అయ్యాయి.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్ వద్ద అభ్యర్థుల సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని, వారికి పూర్తి స్థాయిలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వెంటనే టీ--పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకుని, ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు.

# రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

## మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు -- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



కరీంనగర్, జనతా న్యూస్. 28 జనవరి 2026 : వచ్చే నెల 17 నుంచి ప్రారంభమవుతున్న రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలోని మసీదులు, ఈద్గాలు, ప్రార్థనా ప్రదేశాల వద్ద అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సామూహిక నమాజ్ జరిగే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వీధిలైట్లు వంటి మౌలిక వసతులు సమర్థవంతంగా కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, వీధిలైట్లు పనిచేయని చోట మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థనా ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఎల్ఎండిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 47వ అధ్యాయన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్, డిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కోరారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో 47వ అధ్యయన బ్రహ్మోత్సవాల శుభ పత్రికను విడుదల చేశారు. ఎల్ఎండీ కాలనీలోని మానేరు జలాశయం తీరాన శ్రీ పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయ 47వ అధ్యయన బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 18తేదీన మొదలై 25 తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. ఫిబ్రవరి 20న నవకలశ, స్నపన మహాభిషేకం, 21న ధ్వజారోహణము, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, ఫిబ్రవరి 22తేదీన ఉదయం 11 గంటలకు శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవము అనంతరం అన్న ప్రసాద వితరణ వైభవంగా నిర్వహించబడుతుందని అన్నారు. 23 నాడు సామూహిక విష్ణు సహస్ర సమార్చన, 24న శకటోత్సవవు, సాయంత్రం రథోత్సవము, 25న మహా పూర్ణాహుతి, దోపోత్సవము, కదంబ కార్యక్రమం, సాయంత్రం శ్రీ పుష్ప యాగము, ద్వాదశారాధనలు, సప్తావరణములు, ద్వజావరోహణము, గ్రామ బలి, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించబడుతాయని ఆలయ కమిటీ తెలిపింది. బ్రహ్మోత్సవాలలో కరీంనగర్ తోపాటు తిమ్మాపూర్ మండలంలోని అన్నీ గ్రామాల నుండి, ఇతర మండలాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు సుమతి, శ్రీనివాస్ గుప్తా, ఈఈ సదయ్య, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ఎన్టీపీఏలు వెంకటేశ్వర్ రావు, మామిడి రమేష్, దేవాలయ కమిటీ సభ్యులు వొంటెల రవీందర్ రెడ్డి, పోలు కిషన్, నాగరాజు, ధనలక్ష్మీ, అశోక్ రెడ్డి, కరుణ, పద్మావతి మహిళా మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర పార్టీల నుండి పలువురు నాయకులు భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకుని పార్టీలో చేరగా వారికి నాయకులు స్వాగతం పలికారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గొల్లపల్లితోపాటు అల్గునూర్ కి చెందిన నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ కు చెందిన మైనార్టీ నాయకులు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ లో చేరిన నాయకులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నందునే బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం తాము కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే దంపతులు ఇంటింటికి తిరిగి ఓట్లు అడిగారని, అల్గునూర్ లో ఆసుపత్రి కడుతామని చెప్పి ముఖం చాటేసినారని, ఇందుకు అల్గునూర్ సాక్ష్యంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గెలిచి రెండేళ్లయినా అల్గునూర్ ను ఇప్పటి వరకు పట్టించుకోలేదని, మోసం పోయామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాల్వ మల్లేశం గెలుపు కోసం పని చేస్తామని ముందుకు వస్తూ పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని రసమయి తెలిపారు. అలాగే గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలోని 140 గ్రామాల్లో ఎమ్మెల్యే వెళ్లని గ్రామాలు 80 ఉన్నాయని, ప్రజలు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, అందుకే గ్రామాల నుండి సైతం బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని, గొల్లపల్లి మాజీ సర్పంచ్ అంజయ్యను తాము ఆహ్వానించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, అల్గునూర్ 8వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి కాల్వ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, ల్యాగల వీరారెడ్డి, నాయిని వెంకట రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, పాశం అశోక్ రెడ్డి, కనుకం కొంరయ్య, సల్ల మహేందర్, నీలం ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బండి సంజయ్ సాంగ్ విడుదల

## 'బలిరా బలిబలిరే' పాటకు కరీంనగర్‌లో భారీ స్పందన

కరీంనగర్, జనతా న్యూస్, 28 జనవరి 2026 : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై రూపొందించిన ప్రత్యేక గీతం కరీంనగర్‌లో రాజకీయ హల్‌చల్ సృష్టిస్తోంది. ప్రముఖ రచయిత బుల్లెట్ బండి లక్ష్మణ్ రచించిన ఈ పాటను గాయకుడు నల్లగొండ గద్దర్ ఆలపించగా, 'బలిరా బలిబలిరే' సాంగ్‌గా విడుదలైంది. బుధవారం సాయంత్రం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ శ్రేణులు ఒకేసారి ఏడు చోట్ల ఈ పాటను విడుదల చేశారు. గీతా భవన్ చౌరస్తా, ఎస్ఆర్ఆర్ కాలేజ్, రామ్నగర్ స్టేజ్, కమాన్ చౌరస్తా, టవర్ సర్కిల్, గాంధీ రోడ్డు, కోర్టు చౌరస్తా ప్రాంతాల్లో పాట విడుదల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, బండి సంజయ్ అభిమానులు పాల్గొని సంబురాలు జరుపుకున్నారు. ఈ పాటకు యువత నుంచి విశేష స్పందన లభిస్తుండగా, కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదుల్లో ఉత్సాహం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఈ పాట ప్రాధాన్యత సంతరించుకుంటుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com